శ్రీ

# రాంభట్ల వేంకటీయము

కీశే డా॥ రాంభట్ల వేంకటరావు(కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

పద్య కావ్యం



"అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో

# శ్రీ రాంభట్ల వేంకటీయము

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

(పద్య కావ్యం)



రచన:


'అవధాన సుధాకర' 'అష్టావధాని' **రాంభట్ల పార్వతీశ్వర శర్మ**

ఎం.ఏ. తెలుగు.

పరిశోధకుడు - తెలుగుశాఖ- ఆంధ్రవిశ్వకళాపరిషత్.

సెల్ : 9247 85 95 80.

# గ్రంథారంభం

## దైవస్తుతి

కం॥ శ్రీ కాశీ విశ్వేశా
లోకైక శుభంకరేశ! రుద్రా!భద్రా!
మా కామితార్థ దాయక!
శ్రీకంఠా! నిన్ తలంతు చిత్తమునందున్!!

మ॥ అలకైలాసమునందు గౌరియొడిలో నానందమున్ గ్రోలుచున్
పిలువంగానరుదెంచు దైవమ! మహావిఘ్నేశ! ప్రార్థింతు, నా
కలముంబట్టితి వీవెయన్నపగిదిన్ కావ్యాంతమున్ బ్రోవుమా
యిలలో సర్వశుభమ్ములిచ్చు వరదా! హే వక్రతుండా! ప్రభో !!

శా॥ శ్రీకారమ్మును చుట్టుచుంటినిదియే శ్రీనాధ, వేంకన్నవై,
ఏకాకారము దాల్చి నిల్చి మదిలో,నింపైన భావమ్ములన్
వైకుంఠేశ! యొసంగి నాదు "కులకావ్యమ్మున్" మహిన్ నిల్పగా
చేకూరంగను చేయుమయ్య బలమున్ శ్రీసప్తశైలేశ్వరా!!

ఉ॥ పంచముఖంబులన్ వెలసి భక్తుల బ్రోచెడు వేదమాత, నీ
పంచను జేరి వేడెదను పాదములన్ విడనింకదేవి, నే
నెంచితి నీవె దైవముగ నేమనిఁజెప్పుదు నీది శక్తి, రా
యంచయె వాహనమ్ముగ మదార్తినిఁ దీర్చు మదంబరో నతుల్!!

కం॥ కలనైనన్ నినుమరువక
తలతుము రాంభట్ల వంశదైవమ, సతమున్
నిలకడతో మముగాచెడు
యిలవేలుపు "వేంకమాంబ"నిదెప్రార్థింతున్!!

# శ్రీ రాంభట్ల వేంకటీయము

## కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

## (పద్య కావ్యం)

1. కం॥ అది యాంధ్ర విజయ నగరం,
బది గజపతి నగరపుదరి, నత్యున్నతమౌ
నది కెంగువాగ్రహారము,
పదిపై నవశతములున్న వత్సర మదియున్ !!

2. తే.గీ॥ అచట నిత్యాగ్ని హోత్రుండు, నవని సురుఁడు,
చూడ రాంభట్ల వంశంపు రేడతండు,
కాంక్ష మీరుగ వెంకన్న గారు మదిని
ధర్మ పత్ని సుబ్బమ్మ పై ధ్యాస నిలిపె!

3. మ॥ నవమోహంబున హృద్వనమ్మునను సంతానాభిలాషాధృతిన్
గవయన్ దంపతులా ముహూర్త మహిమన్ గర్భమ్ము నిల్చెంగదా
యువిదల్ దెచ్చిరి సూడిదల్ దినదినంబొక్కొక్కరొక్కొక్కటిన్
నవమాసంబులు నిండె, సుబ్బమ మహానందమ్ముతోనుండగా!!

4. కం॥ పరగ నవంబరు నెలలో
నిరువది నాల్గవ దినమున, నిరులుడుఁగన్ భా
స్కరుఁడుదయించు విధమ్మున
బరమేష్ఠినిఁబోలు నొక్క బాలుంగనియెన్.

5. కం॥ వేంకన్నాసుబ్బమ్మలు
వేంకన్నావేంకమాంబ వేల్పుల దయతో,
వేంకటరావను పేరిడి
రింకన్ శిశు కంఠశోభ యింటను నిండెన్!!

6. కం॥ శోకము కాదారాగము,
శ్రీకాకుళ కుప్పిలి యెడ శ్రీకరనాదం
బేకైక రోగమంత్రము,
లోకంబుల మేలుఁగొలుపు శ్లోకంబునగున్!

7. తే.గీ॥ హరితుఁడంబరీష యవనాస్య ఋషివరులు
మువురు రాంభట్ల వంశంపు మూల పురుష
లగుట, హరితస గోత్రమై యలరు చుండు
భూసుర గ్రామణుల యందు వాసికెక్కి

8. తే.గీ॥ అట్టి హరితస గోత్రాన్వయమ్మునందుఁ
గలిగెనాబాలుఁడపర శంకరుని భంగి,
యతుడు వెంకన్న సుబ్బమ్మ లనుఁగు సుతుఁడు
తేజమొప్పగ వర్ధిల్లె దినదినమ్ము.

9. కం॥ కొడుకున కైదవ వత్సర
మడుగిడె, వెంకన్న యక్షరాభ్యాసంబున్
కడు ముదమునఁ జేసియుఁ దా
బడి చదువులకంపె వాని వాణీకృపకై !!

10. తే.గీ॥ తనయు చదువుల మదిలోనఁ దలచుకొనుచు
కంటఁదడి లేక తనకున్న పంటపొలము
కౌలుకిచ్చియు వెంకన్న కర్షకులకు
స్వగృహమును వీడి ధృతి తోడవలసఁబోయె

11. తే.గీ॥ అగ్రహారమ్మునుంబాసి యా త్రయమ్ము
విజయనగరమ్ము చేరి, రావిప్రవరులు
బ్రాహ్మణులు వాసముండు దివాంజి పేటఁ
బెంకుటిల్లుఁ గట్టించిరి వేడ్కమీఱ!!

12. తే.గీ॥ ఆలు బిడ్డల తోడుత హాయిగాను
కాపురంబుండె నందు వెంకన్న గారు
మూలికా వైద్యమందున ముఖ్యుడగుచు
దేవతారాధనముతోడ దీప్తి నందె

13. తే.గీ॥ పూర్ణ దీక్షాపరుండయి మోక్షమొసగుఁ
రాజరాజేశ్వరీదేవి రక్ష కాగఁ
కుంకుమార్చనఁ జేయుచున్ గొరత లేక
సత్యదీక్షను వెంకన్న సాగుచుండె!!

14. తే.గీ॥ అరయ సప్తమవత్సరమందు నొసగెఁ
దండ్రి బ్రహ్మోపదేశమ్ము తనయునకును;
బ్రహ్మ చర్యంపుదీక్ష చేఁబట్టి చేసె
నతడు "నక్షర లక్ష గాయత్రి" జపము.

15. తే.గీ॥ సోమయాగము తలపెట్టి సూనుజప ఫ
లంబు ధారవోయించి సద్రక్ష యనగ;
'సోమయాజి'గ వెంకన్న శోభమీరె,
'సోమద'ను నామమునుఁబొందె సుబ్బసాధ్వి.

16. కం॥ అది వేంకటరావునకున్
బదునాల్గవ యేడు, తల్లి పరమపదించెన్!
హృది కలచు విషాదమునం
దుదయించెను 'వైద్యవిద్య' యొక కోరికగా!!

17. కం॥ యోగాసన సాధనమున
రోగములకతీతుడై పురోగతిఁబొందెన్!
బాగుగ వ్యాయామంబునఁ
దాఁగొనె నద్భుత శరీర దార్ఢ్యము నెలమిన్!!

18. కం॥ విద్యల నగరమునందున
విద్యాభ్యాసమ్మును నెరవేర్చుచు నెదిగెన్!!
విద్యల *"ఎఫ్ఫే" జేరిన
హృద్యములౌ రోజులవియు నెంచగ నపుడున్!!

19. ఆ.వె॥ మొదటి వత్సరమ్ము ముగిసి, రెండవ వర్ష
మదియు గడిచి జేరె నంత్య దశకు
వ్రాయనెంచి నట్టి వ్రాత పరీక్షలో
చోటుఁ జేసికొనెను చోద్యమొకటి!!

20. శా॥ ఆనాడాంగ్లపరీక్ష! దాని విడె నాయాంగ్లేయులన్ గూల్చఁగన్
'జై' నాదేశ నినాదమున్ భరతభూస్వాతంత్ర్య సంగ్రామమున్
నానా కంఠ సమూహమందొకటిగా నవ్యప్రభుత్వమ్ముకై
తానుంగాంధిమహాత్మ్మ వెంటఁ జనె సిద్ధాంతమ్ముకై స్ఫూర్తితో!!

21. కం॥ స్వాతంత్ర్యోద్యమ పుణ్యము
నా తరిఁ దప్పెన్ పరీక్ష, నా యపజయమున్
ఖాతరు జేయక,తాఁ గృషి
నూతగఁగొని బింకమలర నుత్తీర్ణుఁడయెన్

22. ఆ.వె॥ పడుచు ప్రాయమందె పదునెన్మిదవ యేట
సూర్యకాంతమతని భార్య యయ్యె
కదలివచ్చినట్టి కళ్యాణ ఘడియల
దాట సాధ్యమౌనె ధాతకేని?

23. శా॥ జ్యోతిశ్శాస్త్రమునందు భాస్కరుఁడు తా జ్యోతిర్మయీ పుత్రుఁడౌ
తాతాపాపయ శాస్త్రియున్ దనయ కాంతమ్మన్ గడున్ బ్రీతితో
వ్రాతల్, జాతక చక్రముల్ కలియ కళ్యాణమ్ము గావించి, జా
మాతౌ వేంకటరావు వెంట నలివేల్మంగమ్మగాఁ బంపెనే!

* **F.A.** ఫెల్లో ఆఫ్ ఆర్ట్స్ ( ఈనాటి ఇంటర్మీడియట్)

24. కంII ఆపై డాక్టరు చదువగఁ
దాపత్రయ పడుచు నడిగెఁ తండ్రినతండున్!
గోపముతోఁ గాదనుచున్
నాపలుకులు వినుమటంచు నయమునఁజెప్పెన్!!

25. కంII పరజాతుల నంటుట భూ
సురులకు క్షితిఁజెల్లదంచు సూక్తులఁదెలిపెన్
దొరవిద్యల నేర్వగ నీ
యురుకులఁనికఁగట్టి పెట్టుటొప్పని పలికెన్

26. కంII కాయములన్ కోయుగ వలెఁ
ఛీ యనకే యెన్నిపనులో చేయగ వలయున్
నాయన! నీవావైద్యపు
ఛాయలకుం బోకుమంచుఁ జక్కగఁ దెలిపెన్

27. కంII అల్లోపతిఁ జెప్పింపగ
వల్లయు గాదయ్య ధనము పంపఁగ నాకున్!
కల్లగు విద్యలుబట్టుట
చెల్లదనెన్ తనయుగాంచి స్థిరవాక్యముగా!!

28. కంII అంతన్ వేంకట రావున్
జింతాక్రాంతమ్మునైన చిత్తముతోడన్
సుంతయునాలింపక తాఁ
బంతమునన్ దండ్రి యెదుటఁ బలికెన్ ధృతితో

29. కంII మాయల మాటలు జెప్పక,
పోయెడి నా బండినిటులఁ బోనిమ్మనియెన్;
జేయుట వైద్యాభ్యాసము
ఖాయంబని తేల్చి చెప్పి కరములు మోడ్చెన్!!

30. కం॥ చేకొనె నొక నిర్ణయమున్
లోకములే యేకమైన రూఢిగఁ జదువన్
మేకొంచు వైద్యశాస్త్రము;
శ్రీకారముఁజుట్టె నతడు శ్రీరాము దయన్!!

31. శా॥ సామాన్యుండయి విద్యనేర్చుటకునై సాగించున్ యానమున్
రామానీదియ భారమన్న పగిదిన్ లక్ష్యమ్ము సాధింపఁగా
మీమాంసల్ విడి యేక చిత్తమున దా మేలెంచి, స్వాతంత్ర్యమే
క్షేమంబంచు విశాఖపట్టణమునన్ 'కింగ్జార్జి' ఆస్పత్రిలోన్

32. కం॥ తడబడి పలు జడిమలుదా
'మెడికల్ కాలేజి' నందు మేలుగుజేరెన్;
బడుచున్ బాట్లను కొల్లలు
నడుగడుగున రామచంద్రునాత్మఁ దలంచెన్

33. ఆ.వె.॥ నాల్గు వత్సరములు నడువంగనీరీతి
వెల్గుజూసె వైద్య ఫల్గుణుండు,
సకల శస్త్రములను సాధించి, వ్యాధులన్
బారఁద్రోలనురికె తేరునెక్కి.

34. కం॥ * 'ఎల్లెంపీ' పట్టాగొనె
నెల్లరకున్ సేవఁ జేయనెంచెను, దనదౌ
యుల్లంబున వైద్యమ్మును
బెల్లగు దైవంబనంగ బ్రీతిన్ నిలిపెన్.

35. కం॥ పలుశాఖల వైద్యమ్మున
బలురీతుల శిక్షణఁ గొని పండితుఁడయ్యేన్
బలు చోట్లను పనినేర్చెను
పలువురి రక్షించి నిండు ప్రాణములొసఁగెన్ !!

---

* **L.M.P.** లైసెన్షియేట్ మెడికల్ ప్రాక్టీసనర్

36. తే.గీ॥ పరగ ముషునూరు వేంకటేశ్వరునిఁగూడి
జంటగా సేవలిడి చికిత్సాలయమునఁ
గొన్నినాళ్ళనుభవమును గొన్న పిదప
తరలె నుద్యోగముంజేయఁ బురము వీఁడి!!

37. ఆ.వె॥ తండ్రిగారినీడ, దన సతీమణి తోడ
వడ్డె దేశమునకు వలసఁబోయి
కొన్ని వత్సరముల కొలదియు 'కళ్యాణ
సింగు పురము'నన్ వసించి యుండె.

38. ఆ.వె॥ అలరె నవ్యకాంతులచ్చోట వారింట
విరిసె నవవసంత విరులశోభ
గర్భమంద సూర్యకాంతమ్మ తొలుతగా
మురుసెవారి జంట ముదముతోడ

39. కం॥ ఆ తన్వి సూర్యకాంత
మ్మో తనయకు జన్మనిచ్చి యుత్కృష్టంబౌ
మాతృత్వమన్న మాటకు
నౌ తియ్యందనము నచటె యాశ్వాదించెన్!!

40. తే.గీ॥ ప్రభవ వత్సరమున బ్రభవించె నాసుత
యాదిలక్ష్మిదేవి యంశ యనగఁ
బిలువనెంచెనామె నిలవేల్పు పేరిట
'వేంకమాంబ'యనుచు వేడ్క మీఱ!!

41. ఆ.వె॥ 'సుబ్బసోమదేవి' సుగుణశీలములన్ని
సంతరించుకొనఁగ సద్గతి, తన
తల్లి పేరుఁవెట్టెఁ దదుపరి తనయకున్
శుక్ల నామ వర్ష శోభయందు.

42. ఆ.వె॥ మన్య దేశమద్ది, మనగ సాధ్యముఁగాక
విడువనెంచెనట్టి విపినసీమ
నచటినుండి సాగెనతడు కుటుంబియై
తిరిగి విజయనగరపురమునకును

43. కం॥ రూరల్ డిస్పెన్సరిలోఁ
జేరగ దరఖాస్తుఁ జేసి జిల్లాబోర్డున్
గోరఁగ, 'కింతలి', 'కుప్పిలి'
యూరల వైద్యంపు గొరత యుండగఁ దెలిసెన్!!

44. కం॥ తప్పొప్పులు రామేచ్ఛగ
గుప్పెడు మదిలో దలంచి, గురువైద్యుడు తాఁ
గుప్పిలిలో నుద్యోగము
నొప్పుగఁ జేయంగనెంచె నుత్తమమనుచున్!

45. సీ॥ కనుచూపు మేరలో కడలి దర్శనమిచ్చి
వినసొంపు ఘోషతో విందుఁ జేయు,
మొగలి పూవుల గంధమును ఘ్రాణమొనరింపఁ
దనువెల్లఁ బులకించుఁ దన్మయమునఁ,
గపటమ్ము నెరుగని గ్రామవాసుల మనం
బులు మాటలందునే తెలియవచ్చు,
మట్టి దారులు పంచు మధురానుభూతుల
నెత్తు పల్లంబులన్ హృద్యముగను,

ఆ.వె॥ గెడ్డ చెలమనీరు గీర్వాణకోటికా
ధారమై చెలగుసుధారసమ్మె.
యిట్టి యానవాళ్ళ నిల స్వర్గసీమయే
కుప్పిలన్నపేరఁగొల్పు తీరె !!

46. తే.గీ॥ అట్టి కుప్పిలి గడ్డపై నడుగు పెట్టి,
సేవఁజేయఁగనెంచెను రావుగారు;
సమయమేతెంచెఁ కారణ జన్మునకును
తనదు కర్తవ్యమొనరింప ధరణియందు!!

47. సీ॥ అంధకారము బాపి యవనిమేల్కొల్పంగఁ
జనుదెంచు చున్న భాస్కరుండనంగ,
ముకుళించుకొనియున్న ముద్దు కల్వలఁదట్టి
చైతన్యమున లేపు శశియనంగ,
శీతలత్వముఁగూర్చి జీమూతముల నిలన్
వర్షింపగాఁ జేయు బవనుఁడనఁగ,
వైద్య సంపదలేక వ్యాధులనల్లాడు
వారి పట్లను దేవవైద్యుడనగ.

తే.గీ॥ బ్రహ్మ తేజమ్ము నరునిరూపమ్ము దాల్చి,
భువిని వేంకటరావుగా నవతరించి,
కాలుమోపెను "కుప్పిలిగడ్డ" పైన
వైద్యనారాయనుండయ్యె భవ్య గతుల!!

**కోదండ రాముడు**



48. శా॥ చేతంబూని కఠోర రాక్షసులకున్ జేటైన కోదండమున్
సీతాలక్ష్మణపూర్ణుఁడై,వరదుఁడై,శ్రీరామచంద్రుండు తాఁ
బ్రీతింబాలనఁ జేయుచున్, గరుణతో వీక్షించుచున్ దక్షుడై
యేతద్గ్రామ జనంబుఁబ్రోచునెపుడున్ హృత్పద్మసంవాసియై!!

## కుప్పేశ్వరుడు



49. సుగంధి॥ ఈశుఁడున్ మహేశుఁడున్ మహేశ్వరీప్రియేశుఁడున్
గాశికాపురీశుఁడున్ ధగజ్వల త్రినేత్రుఁడున్
శ్రీశివానినాథుఁడున్ కరీంద్రచర్మధారి కు
ప్పేశుఁడయ్యెనప్పురానఁ బేర్మికూర్మితోమహిన్!!

50. ఉ. కేశవ దర్శనమ్ముఁబరికింపగఁ బెక్కులు వత్సరంబునం
దా శివరాత్రినాడు మరియాపయి కార్తిక సోమవారమం
దీశుని దర్శనమ్ముఁగొను నేటికి రెండుదినమ్ములందె, కు
ప్పేశుడు వాని రాకకయి యెంత తపించునొ? వేచియుండునో?

## ఇల్లు

:

51. సీ మట్టిగోడలె గాని మమతాను రాగాల
నింపి కట్టిన మహానిలయమద్ది,

యిరుకు వాకిలె గాని యినవంశరామయ్య
హృదయమ్ము గలవాని సదనమద్ది,
మిద్దెటిల్లేగాని మేదినిన్ సరిలేని
వ్యక్తికి నెలవైన వాసమద్ది,
కమ్మరిల్లే గాని ఘనగుణమ్ముల రాశి
బ్రాహ్మణోత్తముడుండు భవనమద్ది,

తే.గీ|| అదియె సౌఖ్యమ్ములొనగూర్చు నవనినాక,
మదియె రోగాలఁ బరిమార్చు నాలయమ్ము,
సతత మానందమునఁ దూగు సద్గృహమ్ము
నదియె వేంకటరావునకాకరమ్ము.

## ఇల్లాలు

52. కం|| ఒక వంకను గృహకృత్యము
లొక వంకను పొలము పనులనోపిక తోడన్
జకచకఁజేయుచు, భర్తకు
సకలంబై సహకరించు సతి కాంతము తాన్!!

53. తే.గీ|| అతిథులేతెంచగా వారి నాదరించి
వండి వడ్డించుచుండు నాపరమ సాధ్వి
షడ్రసోపేతమైన భోజనముఁబెట్టు
దొడ్డయిల్లాలు కాంతమ్మ తొట్రుపడక

## సోమయాజులు గారు పరమపదించడం

54. ఉ. కంటికిజూపు తగ్గినది కాళ్ళనుసత్తువ సన్నగిల్లె, నే
నొంటరిగా మనంగనిక నొప్పదటంచును సోమయాజి తా
వెంటనె చేరెకుప్పిలికి, వేంకటరావును సంతసించె; నా
యింటనె ప్రాణముల్ విడచె నిష్టజనమ్ముల సేవలందుచున్

## కుప్పిలి బిడ్డలు

55. కంII పరికింపనెంత ప్రేమయొ!
ధరనొక జీవమ్ము రూపుదాల్చుట యనగా!
సిరికొల్వు తీరియుండెను;
నరయగ సంతానలక్ష్మియై తన యింటన్!!

56. కంII వరుసగ నల్వురు సుతులును,
వరుసగ నల్వురు సుతలును వత్సరభేదాల్
చిరుమాత్రంబుగ, విరులై
విరిసిరి 'రాంభట్ల' వంశవృక్షమునందున్ !!

57. కంII నిలుప తన జనకనామము,
నిలబెట్టెడు సుతుఁడుఁగాగ, నేర్పరి కాఁగన్;
గలిగిన తొలి పుత్రునిఁ దా
నలరఁగ రాంభట్ల"సోమయాజి"గఁ బిలిచెన్

58. కంII పుట్టిన ద్వితీయ సుతునకు
పెట్టెను తన మామగారి పేరొప్పంగా
నుట్టిపడు తేజముంగని
యిట్టుల రాంభట్ల 'పార్వతీశుండ'నియెన్!!

59. కంII తిక్కన భారతగాథన్
మక్కువచే నొక్కసుతుని మాన్యుడుఁగాగన్
చక్కగ "హరిహరనాథ"గ
మిక్కిలి సంతోషమొప్ప మేకొని పిలిచెన్!!

60. ఆ.వె॥ పుట్టెనొక్కపట్టి పుత్రికారత్నమై
రామభట్ల వారి గీమునందు
ముదమునెంచిచూడ మూనాళ్ళ ముచ్చటై
స్వర్గసీమకామె నిర్గమించె!!

61. ఆ.వె॥ బాలకృష్ణుడనిన వాత్సల్యముప్పొంగఁ
గొమరులందు చిన్న కొమరునకును
"బాలకృష్ణశర్మ" పావన నామమ్ము
పెట్టిపిలిచెనతడు ప్రీతితోడ!!

62. ఆ.వె॥ అవని యంబరూపమనురీతి నొకపుత్రి
యతని యింట కుప్పిలందుఁబుట్టె
నత్తగారి నామ "మన్నపూర్ణ"ను బెట్టె
నా తృతీయ సుతకు నలరు రీతి!!

63. కం॥ సత్యంబగు"రాజేశ్వరి"
నిత్యోపాసకుడు తండ్రిమ్మ నిశ్చలమతితో
నత్యున్నత మానామము
ప్రత్యక్షర రమ్యమొక్క పాపకు బెట్టెన్!!

64. ఆ.వె॥ సగముదల్లి పేరు, సగము కాసుల తల్లి
పేరు కలియుబెట్టి, వెరసిజూడ
"సుబ్బలక్ష్మి"యన్న సూనృత నామమ్ము
నొసగె ప్రేమఁదోడ నొక్కసుతకు!!

65. తే.గీ॥ అన్నవరమందు వేంచేసి యున్నవేల్పు
సత్యదేవుని నామమ్ము సార్థకముగ
గారమొప్పగనొసగెను కడమసుతకు
"సత్యనారాయణమ్మ"గా సంతసమున

66. మ.కో॥ అక్కరమ్ములనాదిగా మరి హద్దుపద్దుల నేర్పుచున్
నిక్కమౌయితిహాసగాథల నీతిబోధలఁ దెల్పుచున్
బెక్కువిద్యల శిక్షణమ్మిడి, విజ్ఞతాత్ములఁ జేయుచుం
జక్కనౌగతి తీర్చిదిద్దెను సంతతిన్ కడుశ్రద్ధతో!!

67. కం॥ కన దుహితల కనునయమున
తనయింటనె పురుడుఁబోసి, తాత విధాతై!
మనుమల మునిమనుమల కిల
నొనగూర్చెను జీవమెలమి నొప్పగు రీతిన్!!

68. కం॥ ఇంపుగఁగాచిన నేతులు,
తంపిని మరిగించు పాలు, తాజాకూరల్
దంపుడుబియ్యపుటన్నము,
పెంపెసగభుజింత్రువారు ప్రీతిఁదలిర్పన్!!

69. ఉ॥ వైద్యముజేయుచున్ సకల వ్యాధుల మాపుచు; పొట్టకూటికై
సేద్యమునూతగా గొనె కృషీవలుడై; యటు స్వచ్ఛమౌ స్వరా
జ్యోద్యమ భావనల్ జనుల సూక్తులుదెల్పుచు, దేవపూజ్యమౌ
పద్యము సాహితీసతికి పట్టముఁగట్టగఁ బట్టెనెంతయున్

70. ఉ॥ నామమునెంచినేని పదునాలుగు పేటల కేకవైద్యుడున్
ప్రేమను సాక రోగివ్యథ పేరుకునైనను చేరదేదరిన్
కోమలమూర్తి, కోపనిధి "కుప్పిలిడాక్టర" నంగ ముఖ్యుఁడౌ
నామహనీయు స్పర్శను నయంబయి పారని రోగమున్నదే?

71. చం॥ నిలకడయైన వైద్యమట నిక్కము కుప్పిలి గ్రామమందునన్
కలకల నవ్వఁగా జ్వరము కానఁగ రాదిక రోగిచెంతనే
ఫలమగు స్పర్శయౌ నదియు పావనవేంకటరావు గారి దా
ఫలమును గ్రోలినన్ తరలు వ్యాధులటంచును నమ్మిరాజనుల్!!

72. ఆ.వె॥ ఉష్ణదేశ రుజలనుడుపగా కలకత్త
చేరి వైద్యమందు నారితేరి
సూక్ష్మ కాలమందె 'స్కూలాఫు ట్రాపికల్
మెడిసనందు' ఖ్యాతి బడసెనతఁడు

73. కం॥ అరయ 'ప్రజారోగ్య'ముకై
'పరిరక్షణశాఖ'లోన ప్రత్యేకముగా
నెరవేర్చె శిక్షణమ్మును
మరియా మద్రాసు * పూనమల్లిని గనగఁన్

74. తే.గీ॥ నాటి వైద్యులయందున మేటియైన
లక్ష్మణస్వామి మొదలియార్ శిక్షణమున
నేర్చియు ప్రసూతి వైద్యమ్ము నిశితముగను
సాటిలేనట్టివైద్యుడై సాగెనతడు

75. ఆ.వె॥ మంత్రశాస్త్రమునకు మారుపేరుగ నిల్చి
కీర్తికెక్కినట్టి మూర్తియతడు,
ఎట్టిరుగ్మతైన యిట్టెతొలఁగిపోవు
నతని చూపె మంత్రమన్న రీతి.

76. కం॥ మంత్రముచే విషమును, తగు
యంత్రముచే వ్రణములాది హానికరంబుల్.
తంత్రమున మనోరుజను, ని
యంత్రించునటన్న గొప్ప ఖ్యాతివహించెన్!!

77. కం॥ తనరాకతెలిసినంతనె
తనచూపులు సోకినంత తరలును రోగాల్
తనకరము తగిలినంతనె
మనుజ మనోవ్యాధులుడుగు మటుమాయంబై !!

* **పూనమల్లి:** మద్రాసు దగ్గఱ ఒక గ్రామము

78. కం॥ ఆయుర్వేదము తోఁ దగ
నాయువు నిడునట్టి దిట్ట, యాతని కనినన్,
జేయందించినఁ జాలదె?
వేయంగను మందులేల వృథయగునవియున్!!

79. కం॥ చేపట్టెను సేద్యంబును
బ్రాపుగఁ దమ భుక్తి కొఱకుఁ బశుపోషణతో
నాపదల లెక్కఁ జేయక
యేపున సాగించె ముప్పదేండ్లకు పైగా !!

80. తే.గీ॥ వరిని పండించి పొలముల విరివిగాను
పెసలు, నువ్వులు, మినుములు, వేరుసెనగ
పైరులన్వేసి శాస్త్రీయ పద్ధతులను
రాలుఁబడి హెచ్చ గాదెల రాశిపోసె!!

81. ఆ.వె॥ ఆది సూర్యకిరణమవనిఁ జేరు వడిని,
శరము లక్ష్యమునకు సాగు గతిని
జెలమ వీడి దూకు సెలయేరు కరణిని
నాశుపద్యమల్లునట్టి దిట్ట!!

82. తే.గీ॥ సంస్కృతాంధ్రంబులందున జతురుఁడగుచు
నాంగ్ల, జాతీయ భాషలం దభినివేశ
మలర, కవిచక్రవర్తియై, యాశుపద్య
మాలికలనల్లె నద్భుత లీలనతడు!!

83. కం॥ తేట తెలుంగున నాపై
సాటిక లేదనినరీతి సంస్కృతమందున్!!
మాటలతోఁ దేలికగా
చాటువులన్ చెప్పినట్టి సర్వజ్ఞుండున్!

84. కం॥ * " **కేవల కవి, విద్వత్కవి,**
**కేవల విద్వాంసుడనుచు కింకన్ మదిలో**
**భావింపక, భాషాసతి**
**సేవింపుడ**"టంచుఁబల్కె చిత్తస్ఫూర్తిన్!!

85. తే.గీ॥ "క్షీరసాగరమథనమ్ము" పేరనొక్క
ద్వ్యర్థి కావ్యమ్ము వ్రాసె నన్వర్థముగను
నమృతభాండమ్మె యాగ్రంథమవని యందు;
కాలగర్భమ్మునందది కరిగిపోయె !!

86. తే.గీ॥ కావ్యకంఠ వాసిష్ఠునిన్ ఖరగుపూరు
నందు దర్శించి స్ఫూర్తితో యాదినమ్మె
యాదిగా జీవితాంతమ్ము నా మనీషి
'పావకోళ్ళు' ధరించెను పాదములకు!!

87. ఉ॥ ఖద్దరు వస్త్రధారియయి, కాళ్ళకు రక్షగ పావకోళ్ళతో
నద్దిన గంధమున్ నుదుట నాపయి కుంకుమ బొట్టుఁవెట్టి తాఁ
బెద్దగ గ్రామమంతటికి విజ్ఞత, సభ్యత మారుపేరుగాఁ
బ్రొద్దది యాదిగా జనుల పొల్పుగసాకు మహానుభావుడై!!

88. కం॥ బాపూజీతో కార్యక
లాపములన్ లేఖలందు గ్రామాభ్యుదయం
బేపారగ సాగించుచు
స్థాపించెను శాంతితత్త్వ సామ్రాజ్యంబున్!!

89. తే.గీ॥ 'గాంధి యిర్విను సాల్టు ఫ్యాక్టరి'నిఁ బెట్టి
యుప్పు పండించి చౌకగా నూరనూరఁ
బ్రజల కెల్లను సహకార పద్ధతులను
బంపిణీఁ జేసె నేకైక పావనుండు!!

---

* **కేవల కవి విద్వత్కవి...** : శ్రీ రాంభట్ల వేంకటరావు గారి స్వీయ రచన.

90. కం॥ సహకారబ్యాంకు ఋణముల
నహరహము శ్రమించి కర్షకాళి పసిండిన్
మహి పండించిరి, ఘనుఁడా
"మహనీయు నితాంతకృషిని" మరువగఁ దరమే?

91. కం॥ అంబరు చర్ఖాఁదెచ్చెన్
సంబర పడినూలు వడికె జంటకదుళ్ళన్
* నంబరు అరవై కాగన్
అంబారినెక్కినంత యానందించెన్!!

92. కం॥ అందిన నూలంతయు నా
పొందూరున మగ్గములను పొందికగా రూ
పొందించెను పంచలుగా
అందముగాు గట్టివాని నానందించెన్!!

93. తే.గీ॥ రాట్నముం ద్రిప్పి ప్రత్తిదారమ్ముఁదీసి
మంచిఖద్దరువస్త్రాల మైధరించి
గాంధిభావాలు బోధించి గ్రామజనుల
సర్వ విధములు గాఁచు నిగర్వి యతుడు!!

94. కం॥ ఎందరికో యిప్పించె ప
సందుగ కాంగ్రెస్సునందు సభ్యత్వంబున్!
హిందీ నేర్వండని, పది
మందికి భాషోద్యమమున మార్గముఁ జూపెన్!!

95. కం॥ విద్యార్థులకై దసరా
పద్యములుగ వ్రాసియిచ్చె"బాపు" చరిత్రన్
హృద్యంబగు తెలుగున; నది
సద్యశమును పొందె నాఁడు సంఘమునందున్

* **నంబరు అరవై** : పంచలకు ప్రశస్తమైన నూలు

96. ఆ.వె॥ అంటరానితనము కంటెపాపమ్ములే
దన్నరీతి వైద్యమందఁజేయ
మాలపల్లికేగి మానవత్వముఁజాటె
వైద్యవృత్తి గౌరవమ్ముఁబెంచె!

97. తే.గీ॥ తనకుమార్తెల పెండ్లి సందర్భమందు
నేకపంక్తిని భోజనాలేర్పడంగ
విందుఁగావించె నూరివారందరికిని
కులవిచక్షణ పాటింపఁ గూడదనుచు!!

98. కం॥ భారత, రామాయణములు
బారాయణజేసి గొప్ప పౌరాణికుఁడై
యూరిజనంబులకాయా
సారమ్మును బంచుచుండు సంతసమొప్పన్!!

99. కం॥ ధనమంచుఁబల్క పాపము
ధనముంగొని సేవలిడుట దౌర్భాగ్యంబౌ
నని తలచు మూర్తి, రిపుడౌ
ధనసిద్ధాంతమున కతడు; ధన్వంతరియై!!

100. తే.గీ॥ రెండుచేతులతోఁ జిత్రలేఖనమును
జక్కగావేయగల సవ్యసాచియతుడు
మృత్తికాశిల్పరచనను మేటియనఁగ
దేవతాకారములనెల్లఁ దీర్చిదిద్దు!!

101. తే.గీ॥ కరమునందును గలదొక గరుడరేఖ
దాన సర్పంబు లాతనిదారిఁ దొలఁగు
నెదుటఁ బడినను తలవంచి చెదరి పోవు;
నట్టియోగమ్ము జగతిలోనరుదుగాదె?

102. తే.గీ॥ గగన మునఁజూచి చక్కగా గణనఁజేసి
రిక్కగతులను గనిపెట్టి, లెక్కఁగట్టి
సమయమెంతయొ తెలుపు పంచాంగ వేత్త;
వేంకటార్యుని కళలెన్న వేనవేలు!!

103. ఉత్సాహ॥ చిత్రలేఖనమ్మునన్, ప్రసిద్ధవైద్యమందు, న
క్షత్ర, జోస్య, మంత్ర, పాక శాస్త్రములను దిట్ట, స
న్మిత్రుడౌను జంతువులకు మేలు, కీడులెంచుచున్!
ధాత్రి సత్కళాకరమ్ము తన్మహత్వమూర్తియే!!

104. కం॥ ముప్పదియేండ్లకు పైగాఁ
'కుప్పలి డాక్టరు'నకొక్క కోవెలమదిలో
నప్పుర వాసులుఁ గట్టిరి
చెప్పగ నతిశయము గాదు, చిరసత్యంబౌ!!

105. చం॥ ఎనుబదినొక్క వత్సరము లేకపథంబున సాగెనా రథం
బున, విరిబాటలుండినను ముళ్ళును, రాళ్ళును కొల్లలక్కటా!
పెను సుడిగాలు లాదిగను భీకరసంఘటనల్ తరించి, తా
దినదిన మొక్క వర్షమను తీరునజీవపయోధినీదెనే!!

106. ఉ॥ వ్యాధులమాపునట్టి గురువైద్యునకక్కట కష్టకాలమై
బాధను గూర్చెనే ముదిమివ్యాధిగ పైబడి; యంతవానికిన్
నాథుడులేడ! యార్తిఁగన, నమ్మియుఁజేరెను రామనామమే
సాధనమంచునెంచి మనసార జపించుచు 'కేజిహెచ్చి'లోన్.

107. కం॥ పుష్పకమున ధన్వంతరి
పుష్పమ్ములఁదెచ్చి వైద్యపుంగవ ! యచటన్
గీష్పతిమూర్ఛిల్లెననెన్
బాష్పంబుల రాల్చి, పిలిచె వైద్యమ్మునకై!!

108. కం॥ కననది 'సెప్టెంబరు' నెల
దినముల్ పదిహేను గడిచె, దినమణి పొడిచెన్!
తను చదివిన గుడియొడిలో
కనుమూసెను రావుగారు, కాయము విడిచెన్!!

ఆ.వె॥ అంత నంతరాత్మ యాత్రమ్ము తోడఁ దా
నున్న రీతి నురికి మిన్నుఁజేరె!
దేవగురుని వెండి దీప్తిల్లగాఁ జేసి
యబ్జగర్భులోకమందె నిలిచె!!

తే.గీ.॥ ఆర్య ఋషిసంప్రదాయమ్ము ననుసరించి
జీవనమ్ము సాగించి విశిష్ట గతిని
ముందు తరముల కాదర్శమూర్తివైన
వేంకటార్యుండ! నీకు వేవేలనతులు!!

తే.గీ॥ మీ సంతానము పదుగురు
నా సంఖ్య శతమ్ము దాటెనభ్యున్నతితో!
వాసియు, వన్నెయుఁ దరుగక
భాసురమై కీర్తినంది వరలుచునుండెన్!!

కం॥ మనుమలు మునిమనుమలతో
మనుచున్ మీ యార్జవంపు మహిమఘటిల్లన్
గొనకొని సాగించుచు జీ
వనమును సుఖశాంతులమర వర్ధిలుచుండెన్!!

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు, సూర్యకాంతమ్మదంపతుల
ప్రపౌత్రుడును

శ్రీపార్వతీశ్వర శర్మ, (స్వర్గీయ) ధనలక్ష్మి దంపతుల
పౌత్రుడును

శ్రీ లక్ష్మీనృసింహసోమయాజులు, సూర్యకాంతకామేశ్వరి దంపతుల
ద్వితీయ పుత్రుడును
అగు
'అవధాన సుధాకర' 'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ చే
ప్రణీతంబైన

# "శ్రీ రాంభట్ల వేంకటీయము"

## అను లఘు పద్యకావ్యం సమస్తం సంపూర్ణం

మంగళమ్ మహత్
ఓం శాంతి: శాంతి: శాంతి:

# 'అవధాన సుధాకర' 'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ

**తల్లిదండ్రులు :** సూర్యకాంత కామేశ్వరి, (కీ.శే.) లక్ష్మీనరసింహ సోమయాజులు.

**జన్మదినం**: 09 - డిశంబరు - 1988. **జన్మస్థలం** : శ్రీకాకుళం.

❖ పరిశోధక విద్యార్థి **(Pursuing Ph.D)**. ఆంధ్ర విశ్వకళాపరిషత్.

**- యూనివర్సిటీ గ్రాంట్స్‌కమిషన్ - జూనియర్ రీసెర్చ్‌ఫెలోషిప్ - నెట్ (J.R.F. - NET)** - పరీక్షలో విశ్వవిద్యాలయస్థాయిలో ప్రథమస్థానం.

❖ పి.జి - ఎం.ఏ. సంస్కృతం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

❖ పి.జి - ఎం.ఏ. **తెలుగు**., ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

❖ డిగ్రీ - బియస్సీ మైక్రోబయాలజీ, డా॥ వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్దిలపాలెం,విశాఖ.

❖ ఇంటర్మీడియట్ - మెడికల్ లాబ్ టెక్నీషియన్ కోర్సు, ప్రభుత్వ జూ॥ కళాశాల పెందుర్తి, విశాఖ.

❖ **'తెలుగు భాషాపండిత'** అర్హతా పరీక్ష- 2012 లో **రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం** మరియు ఆంధ్రవిశ్వకళా పరిషత్ పరిధిలో ప్రథమ స్థానం.

**నిర్వర్తించిన ఉద్యోగములు** :

1. **అధ్యాపకులు** - ప్రెసిడెన్సీ డిగ్రీ కళాశాల (ప్రైవేటు), శివాజీపాలెం, విశాఖ.
2. **ఉపాధ్యాయులు** - వినెక్స్**(VINEX, IAS ACADEMY)** కోచింగ్‌సెంటర్, ద్వారకానగర్, విశాఖ.
3. **రేడియో జాకీ (RJ - Casual )**, ఎఫ్.ఎం రెయిన్‌బో, **ఆకాశవాణి**, విశాఖపట్నం కేంద్రం.

## అష్టావధానాలు:

❖ **16వ ఏట అవధానాలు ప్రారంభం.:** ఇప్పటివరుకూ రాష్ట్రవ్యాప్తంగా **35** అవధానాలు.

**ప్రాంతాలు - ఆధ్వర్యవం వహించిన సంస్థలు - సందర్భాలు.**

1. శృంగవరపుకోట - శ్రీ ధారగంగమ్మ ఆలయప్రాంగణం - (ఆంజనేయ, విఘ్నేశ్వరుల విగ్రహప్రతిష్ఠ)
2. విశాఖ పౌరగ్రంథాలయం - విశాఖసాహితి - (గురుపూర్ణిమ)
3. డా॥ వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్దిలపాలెం, విశాఖ.
4. చినముషిడివాడ - విశాఖ.
5. అనకాపల్లి - భారతవికాస్ పరిషత్.
6. నాయుడుతోట - భారతీకళ్యాణ మండపం.
7. విజయనగరం, మహారాజా సంగీత కళాశాల - విజయభావన - (ఉగాది)
8. హైదరాబాదు, శంకరమఠం - పదసాహిత్యపరిషత్.
9. కొవ్వూరు- బాలాత్రిపుర సుందరి ఆలయప్రాంగణం.
10. శృంగవరపుకోట - పుణ్యగిరి కల్చరల్ అసోసియేషన్ - (ఉగాది)
11. కొవ్వూరు- అభయ ఆంజనేయస్వామి ఆలయప్రాంగణం.
12. విశాఖ లలితపీఠం - లలితానగర్ - (పూర్వపీఠాధిపతుల ఆరాధనోత్సవాలు)
13. హనుమంతవాక - వైజాగ్ బ్రాహ్మణ ఫోరం - (ఉగాది)
14. కొత్తవలస - జిందాల్ పాఠశాల - (ఉపాధ్యాయల 3 రోజుల శిక్షణా తరగతుల సందర్భంగా)
15. డా॥ వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్దిలపాలెం, విశాఖ,
(శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచశతాబ్ద్యుత్సవాలు),

16. విశాఖ పౌరగ్రంథాలయం - కళావేదిక - (కళావేదిక వార్షికోత్సవం)

17. విశాఖ జిల్లాపరిషత్ సమావేశమందిరం - (గిడుగు వెంకటరామమ్మూర్తి జయంత్యుత్సవం)

18. పల్లెపాలెం - ఆంధ్ర కుటీరం, యానాం దరి - (పిఠాపురాస్థానకవి శ్రీఓలేటి వేంకటరామశాస్త్రి జయంత్యుత్సవం)

19. చోడవరం-గౌరీశ్వరస్వామి ఆలయం, పురాణసహిత కళ్యాణవేదిక, -

శ్రీఅన్నమాచార్య సంగీతపీఠం - (ఉగాది)

20. కలవరాయి అగ్రహారం - గణపతిముని స్మారక మందిరం, బొబ్బిలి దరి -

(గణపతిముని 75వ ఆరాధనోత్సవం)

21. విశాఖ శ్రీలలితపీఠం - లలితానగర్, విశాఖసాహితి- (లలితాంబికా బ్రహ్మోత్సవాలు)

22. మాడుగుల - బాలవినాయక సేవాసంఘం ( వార్షికోత్సవం )

23. విశాఖ శ్రీలలితపీఠం - లలితానగర్ - డా॥ రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్. (సుప్రసిద్ధ వైద్యులు శ్రీ గన్నవరపు నరసింహమూర్తి- అమెరికా, వారి పర్యవేక్షణలో)

24. జ్ఞానవాణి FM 106.4- **IGNOU,** విశాఖవారి నిర్వహణలో ప్రప్రథమ **FM** రేడియో సంపూర్ణ అవధానం. (తెలుగు భాషాదినోత్సవం 2012.)

25. పి.ఎన్.ఎమ్.హైస్కూలు- కూకట్‌పల్లి-హైదరాబాద్. పదసాహిత్యపరిషత్ (టంగుటూరిజయంతి)

26. 'స్నేహ సంధ్య' సమావేశ మందిరం, స్నేహసంధ్య సంస్థ - విశాఖపట్నం.

27. మేడిచర్ల గ్రామంలోని శివాలయ ప్రాంగణం - కె.కోటపాడు దగ్గర.

28. వడ్డాది, చోడవరం, ప్రభుత్వ పాఠశాల, బాలల దినోత్సవం సందర్భంగా.

29. హైదరాబాదు - శ్రీరామ కృష్ణాపురం - కొత్తపేట దరి. - విశాఖ శ్రీ లలితా పీఠం మేనేజరు శ్రీవాడరేవు సుబ్బారావు గారి వైవాహిక వజ్రోత్సవం సందర్భంగా.

30. గురజాడ కళాక్షేత్రం - ప్రపంచతెలుగు మహాసభలు - జిల్లాయంత్రాంగం. 2012

31. పద్యకవితా సదస్సు, అనకాపల్లి వివేకానంద హాల్ - 2012

32. విశాఖసాహితి - శ్రీలలితాపీఠం సంయుక్తసభ - విజయ ఉగాది, 2013.

33 & 34 శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ **(S.V.B.C. T.T.D. CHANNEL),** హైదరాబాద్. ఉదయం - మధ్యాహ్నం.

35. జయ ఉగాది, ద్రావిడ బ్రాహ్మణ సంక్షేమసంఘం, లలితాకళ్యాణమండపం, సీతమ్మధార - 2014.

**రచనలు:**

1. **శ్రీ రాంభట్ల వేంకటీయము** - (ముద్రితం) కీ.శే. డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవితచరిత్ర, లఘుపద్యకావ్యం. 2007
2. **మొదటి మొగ్గలు -** వచన కవితావ్యాసంగం - 2012.
3. **ప్రతిభాస్వరాలు** - పద్యకవితాసంపుటి - 2012.
4. ఇంకా ఎన్నెన్నో పద్య సన్మానపత్ర రచనలు.

**జాతీయసదస్సుల్లో పత్రసమర్పణలు: (Paper Submissions in National Seminars)**

1. ప్రబంధనాయికగా ఊర్వశి - ఎ.వి.ఎన్. కళాశాల, విశాఖ.
2. శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో వ్యతిరేక స్త్రీపాత్రలు - అనుకూలభావాలు - సిద్ధార్థకళాశాల, విజయవాడ.

3. గుఱ్ఱం జాషువ కవిత్వం - ఔచిత్యపోషణ - తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్.

4. ప్రసాదరాయ కులపతి- అవధానసరస్వతి - ప్రభుత్వడిగ్రీకళాశాల, సిద్ధిపేట, మెదక్‌జిల్లా.

**పత్రికా వ్యాసాలు :**

1. చిత్రకవితా చైత్రకవి - పాల్కురికి - ప్రసంగవ్యాసం

2. నవ్వా... నువ్వెక్కడి దానివి? - స్మైల్‌ప్లీజ్ మాసపత్రిక - మే, 2012.

3. వేణీ సంహారమ్ - కల్పనలు - సంభాషణావైచిత్రి - సుపథ దినపత్రిక - మే,2012.

4. 'మార్గ'దర్శకుడు శ్రీశ్రీ - విజన్ దిన పత్రిక - మే,2012.

5. తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశాలు - విజన్ దిన పత్రిక - మే,2012.

6. నేటికాలపు సాహిత్యావధానాలు - సిలికానాంధ్ర, సుజనరంజని అంతర్జాల పత్రిక - మార్చి, 2013.

7. కథానిలయ కథలు ( కాళీపట్నం రామారావు జీవితావిష్కరణ) - విశాఖ సంస్కృతి మాసపత్రిక, 2012.

8. మూడురోజుల ముచ్చట : తెలుగుమహాసభల సమీక్షావ్యాసం - విద్య ఉద్యోగ దిక్సూచి, జనవరి, 2013.

9. 'సురభిళం' ( సురభి నాటకసంస్థ నాగేశ్వరరావు గారితో పరిచయం)- విశాఖసంస్కృతి, మార్చి, 2013.

**సాహిత్య రూపకాలు - ధరించిన పాత్రలు:**

1. భువన విజయం : ధూర్జటి - జనవరి, 01- 2011, శ్రీలలితాపీఠం, విశాఖ.
2. ప్రాచీన ఆంధ్రకవులు : పాల్కురికి సోమన - ఫిబ్రవరి, 17 - 2011, శ్రీలలితాపీఠం,విశాఖ.
3. భువన విజయం : పింగళిసూరన - మే, 8- 2011, ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం.
4. భువన విజయం : పింగళిసూరన - మే, 10- 2011, కళాభారతి, విశాఖపట్నం.

5. దేవీ విజయం (విజయ దశమి సందర్భంగా) : అల్లసాని పెద్దన - అక్టోబర్, 06 - 2011
6. శతక సరస్వతీ సాహిత్యసౌరభం : మారద వెంకయ్య - ఫిబ్రవరి, 06-2012, శ్రీలలితాపీఠం,విశాఖ.
7. ధర్మ విజయం : గౌతమబుద్ధుడు - 2014శ్రీలలితాపీఠం, విశాఖ.

**రేడియో ప్రసారాలు:**

1. **అవధానం - వివిధ అంశాలు** - ఆకాశవాణి, విశాఖపట్నంకేంద్ర ప్రసారం - 2006
2. **అవధానం - అవగాహన** (ఉగాది సం॥ గా) - జ్ఞానవాణి ఎఫ్.ఎం - ముఖాముఖి - 2012
3. **'సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు'** - శతజయంత్యుత్సవం - జ్ఞానవాణి ఎఫ్.ఎం. - 2013.
4. **'రాయప్రోలు రచనలు - జీవితం'** - రాయప్రోలు సుబ్బారావు వర్థంతి - జ్ఞానవాణి ఎఫ్.ఎం. - 2013.
5. **'భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు'** - వారసత్వసంపద దినోత్సవం - జ్ఞానవాణి ఎఫ్.ఎం. - 2013.
6. **'వసంతకేళి - హోళి'** - జ్ఞానవాణి ఎఫ్.ఎం. - 2014.

**బహుమతులు : పురస్కారాలు:-**

1. **'అవధాన సుధాకర'** బిరుదప్రదానం - విశాఖసాహితి, శ్రీ లలితాపీఠం సంయుక్తంగా- 2013.
2. పద్యరచనలో ప్రథమ బహుమతి - స్నేహ - అంతర్ కళాశాలల పోటీలు - 2005.
3. **'అవధాని'** బిరుదప్రదానం - డా॥వి.యస్.కృష్ణా ప్రభుత్వడిగ్రీ కళాశాల,విశాఖ- 2006.
4. రాష్ట్రస్థాయి పద్యరచన పోటీలలో ప్రథమ బహుమతి- బ్రహ్మకుమారీస్-హైదరాబాద్ - 2006.

**చిరునామా:** 'అవధాన సుధాకర'
'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ
డోర్. నెం. 12 - 166/5, మొదటి అంతస్తు, సిరిరెసిడెన్సీ,
శారదాపీఠంరోడ్, చినముషిడివాడ, విశాఖపట్నం - 530051.
సెల్ : 92478 59580, 93931 22394.

ఇ-మెయిల్ : harithasa_sarma@yahoo.co.in
Blog : yuvaavadhani.blogspot.com